క్లుప్తంగా

బొత్స ఝాన్సీకి అభినందనలు



బొత్స ఝాన్సీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న 33వ వార్డు నాయకులు, కార్యకర్తలు

అల్లిపురం: వైఎస్సార్‌సీపీ విశాఖ పార్లమెంట్ సమన్వయకర్త బొత్స ఝాన్సీని సోమవారం పార్టీ 33వ వార్డు నాయకులు, కార్యకర్తలు మర్యాదపూర్వకంగా కలసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ విజయానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. టెలికాం అడ్వయిజరీ కమిటీ సభ్యుడు పాల శ్రీహరిరెడ్డి, బల్లిగిరి దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యురాలు గంగుల మానస, వై.చిన్నమ్మలు, నీలాపు అయ్యప్పరెడ్డి, ఎస్.ప్రసాద్‌రెడ్డి, బొచ్చ శ్రీనివాసరెడ్డి, మదీనాఖాన్, యుగంధర్‌రెడ్డి, బి.పద్మా, హర్షరెడ్డి పాల్గొన్నారు.

మహారాణిపేటలో భవిత సెంటర్ ప్రారంభం



అచ్యుతరామ పాఠశాలలో భవిత సెంటర్‌ను ప్రారంభిస్తున్న డీఈవో చంద్రకళ

మహారాణిపేట: మహారాణిపేట ఏరియా పిల్లల ప్రత్యేక అవసరాల కోసం అచ్యుతరామ పాఠశాలలో ఏర్పాటు చేసిన భవిత సెంటర్‌ను సోమవారం జిల్లా విద్యా శాఖాధికారి చంద్రకళ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భవిత కేంద్రాల్లో వారంలో రెండు రోజులు ఫిజియోథెరపీతోపాటు బధిరులైన విద్యార్థులకు స్పీచ్ థెరపీ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ సెంటర్ పరిధిలోని ప్రత్యేక అవసరాలు గల పిల్లలు కేంద్రం సేవలను సద్వినియోగం చేసుకోవాలని డీఈవో కోరారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఏపీసీ శ్రీనివాస్, గీతా, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ల తనిఖీ



జ్ఞానాపురం పోలింగ్ బూత్‌లో తనిఖీ చేస్తున్న తహసీల్దార్ రమణ

కంచరపాలెం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జీవీఎంసీ జోన్–5 పరిధిలోని పోలింగ్ బూత్‌లను సోమవారం సాయంత్రం గోపాలపట్నం తహసీల్దార్ రమణ తనిఖీ చేశారు. జ్ఞానాపురంలోని జోనల్ కార్యాలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులతో సరైన గదులు అందుబాటులో లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. జ్ఞానాపురం బిషప్ మరియదాస్ కల్యాణ మండపాన్ని తొలగించడంతో వాటిలో ఉండే సచివాలయాలు వేరే చోటుకు తరలించారని, దీంతో పోలింగ్ బూత్ ఏర్పాటుకు ఇబ్బంది కలిగేందుకు అస్కారం ఉండటంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు త్వరగా చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు ఆయన సూచించారు.

బుద్ధిస్ట్ సొసైటీ కేంద్ర కమిటీ ఎన్నిక

సీతంపేట: ది బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా (టీబీసీఐ) 11వ బౌద్ధ సమ్మేళనం రెండో రోజు కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో నూతన కేంద్ర కమిటీ ఎన్నిక జరిగింది. కమిటీ ట్రస్టీ జాతీయ అధ్యక్షుడిగా చంద్ర బోధిపాటిల్, ప్రధాన కార్యదర్శిగా బి.కె.బరేష్, కోశాధికారిగా శంకరరావు దొంగేరే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యవర్గంలో మిగతా వారిని త్వరలో ఎన్నుకోనున్నారు. భారత రాజ్యాంగ నిర్మాత బి.ఆర్.అంబేడ్కర్ కలలుగన్న ప్రబుద్ధ భారత్ నిర్మాణం కోసం కొత్త కమిటీ కృషి చేస్తుందని, బుద్ధుడి సిద్ధాంతాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లనుందని ప్రతినిధులు తెలిపారు.

ఇది కదా అభివృద్ధి



అత్యాధునిక పరీక్షరాలతో ల్యాబ్



బీపీ చెక్‌చేస్తున్న ఆరోగ్య సిబ్బంది



బురుజుపేటలోని డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



ఓపీ చూస్తున్న వైద్యాధికారి హలీమా

పేదల చెంతకు.. కార్పొరేట్ వైద్యం

- యూపీహెచ్‌సీల్లో ఆధునిక వైద్య సేవలు
- అందుబాటులో అన్ని రకాల పరీక్షలు
- రోగులకు ఉచితంగా మందుల పంపిణీ

నాడు తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో పేద వర్గాలకు సర్కారు వైద్యం అందని ద్రాక్షలా ఉండేది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో కనీస సదుపాయాలు ఉండేవి కాదు. అరకొర సిబ్బందితో వైద్య సేవలు అందక రోగులు నానా అవస్థలు పడేవారు. టీడీపీ పాలకులు ప్రజారోగ్యాన్ని విస్మరించడంతో పరిస్థితి దయనీయంగా ఉండేది. గత్యంతరం లేక అప్పులు చేసుకుని ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లి పేదలు వైద్యం పొందేవారు.

నేడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజా వైద్యానికి పెద్దపీట వేసింది. చంద్రబాబు హయాంలో వైద్యం కోసం ప్రజలు పడుతున్న కష్టాలను చూసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక అందరికీ ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందుబాటులోకి తీసుకురావాలని సంకల్పించారు. కోట్లాది రూపాయలతో ఆస్పత్రుల నిర్మాణం, సకల సౌకర్యాలతో ఆధునిక వైద్యాన్ని ఉచితంగా ప్రజలకు అందజేస్తున్నారు.

డాబాగార్డెన్స్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పాలనలో ఖరీదైన వైద్య సేవలను పేదలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా కార్పొరేట్ వైద్యాన్ని పేదల చెంతకే తీసుకొచ్చారు. వార్డుల్లో కొన్ని దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని ప్రభుత్వ ఆస్పత్రులకు జీవం పోశారు. నాడు–నేడు ద్వారా కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టారు. ఆధునిక సదుపాయాలు, మెరుగైన వసతి సౌకర్యాలు కల్పించారు. డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల(యూపీహెచ్‌సీలు)ను అత్యధునికంగా తీర్చిదిద్ది ప్రజలకు మెరుగైన.. నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నారు.

'దక్షిణ'లో యూపీహెచ్‌సీల అభివృద్ధి

నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా దక్షిణ నియోజకవర్గంలో 3 యూపీహెచ్‌సీలు ఏర్పాటు చేశారు. దొండపర్తిలో రూ.98 లక్షలతో, 36వ వార్డు రంగిరీజు వీధిలో రూ.1.4 కోట్లతో, 34వ వార్డు కొబ్బరితోటలో రూ.1.16 కోట్లతో ఆరోగ్య కేంద్రాలను నిర్మించారు. ప్రస్తుతం వాటి ద్వారా స్థానికులు వైద్య సేవలు పొందుతున్నారు. రూ.10 లక్షలతో చెంగల్రావుపేటలో, రూ.10 లక్షలతో వన్‌టౌన్ ప్రాంతంలో, రూ.10 లక్షలతో ప్రసాద్ గార్డెన్స్, రూ.10 లక్షలతో అల్లిపురంలో యూపీహెచ్‌సీలకు మరమ్మతులు చేపట్టి అందుబాటులోకి తీసుకొచ్చారు.

బురుజుపేట డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వైద్య సేవలు అందుతున్నాయి. ప్రాథమిక వైద్యం నుంచి అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి. జనరల్ మెడిసిన్‌తోపాటు ఆర్థో, గైనిక్, స్కిన్, సర్జన్, పల్మనా లజిస్ట్, ఈఎన్‌టీ, డెంటల్ తదితర అనారోగ్య సమస్యలకు ఇక్కడ వైద్యం అందిస్తున్నారు. ఓపీ మొద లు, వైద్యుల సూచనల మేరకు ఉచితంగా మందు లు అందజేస్తున్నారు. సర్జరీ అవసరమైతే శస్త్రచికిత్స లు కూడా చేస్తున్నారు. మరీ అత్యవసరమైతే రిఫరల్ రాస్తున్నారు. రంగిరీజు వీధి, బురుజుపేట, చెంగల్రావుపేట, బుక్కావీధి, కదిరి దానప్పవీధి, ఎస్‌కేఎంఎల్ ఆలయ ప్రాంతం, సున్నపువీధి, పంజా జంక్షన్, కొత్తరోడ్డు, రీడింగ్ రూమ్, కాదంబరి వీధి, గన్నేరు వీధి, గొల్ల వీధి, జాలరిపేట తదితర ప్రాంతాల ప్రజలు ఈ ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు పొందుతున్నారు. ప్రతి రోజూ 70 నుంచి 80 ఓపీ లు నమోదవుతున్నాయి. ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రి నుంచి కూడా వైద్య పరీక్షల కోసం కొన్ని కేసులు ఇక్కడికి వస్తున్నాయి. ఒక మెడికల్ ఆఫీసర్, ఇద్దరు నర్సులు, ఒక ఫార్మాసిస్ట్, ఒక ల్యాబ్ టెక్నీషియన్, కార్యాలయ సిబ్బందితోపాటు క్లాస్–4 ఉద్యోగుల ద్వారా నిత్యం సేవలందుతున్నాయి.

పూర్తి స్థాయిలో వైద్య సేవలు



బురుజుపేట డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో రోజువారీ ఓపీ పెరుగుతోంది. మందుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఉచితంగానే అన్ని రకాల వైద్య సేవలందిస్తున్నాం. అత్యవసర కేసులు కూడా స్వీకరిస్తున్నాం. మరీ అత్యవసరమైతే రిఫరల్ రాస్తున్నాం. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి సూచనల మేరకు ఎప్పటికప్పుడు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నాం. పూర్తి స్థాయిలో రోగులు సేవలందిస్తున్నాం.
– డాక్టర్ హలీమా, మెడికల్ ఆఫీసర్

ప్రజా వినతులకు సత్వర పరిష్కారం



వినతులు పరిశీలిస్తున్న జీవీఎంసీ జోన్–4 కమిషనర్ ప్రసాదరావు

జగదాంబ: జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన వినతులను సత్వరమే పరిష్కరించాలని అధికారులను జీవీఎంసీ జోన్–4 కమిషనర్ పి.వి.వి.డి.ప్రసాదరావు ఆదేశించారు. జోన్–4 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి రెవెన్యూ, టౌన్ ప్లానింగ్‌కు సంబంధించి మూడు వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా జెడ్సీ మాట్లాడుతూ వినతుల పరిష్కారంలో ఆలస్యం చేయకూడదన్నారు. ఒక వారం వచ్చిన వినతులు మళ్లీ రెండో సారి తిరిగి రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఈఈ సంతోషి, ఏఎంహెచ్‌వో రాజేష్, ఏసీపీ ఝాన్సీ, శానిటరీ సూపర్‌వైజర్ కిషోర్, ఆర్‌వోలు రత్నంరాజు, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

'జోన్–5'కు 4 వినతులు

కంచరపాలెం: జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్–5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి 04 వినతులు అందాయి. అర్జీదారుల నుంచి వాటిని జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ స్వీకరించి ఆయా విభాగాల అధికారులకు అందజేశారు. టౌన్ ప్లానింగ్ విభాగానికి 02, యూసీడీకి 01, రెవెన్యూకు 01 చొప్పున వినతులు అందినట్లు జెడ్సీ తెలిపారు. జగనన్నకు చెబుదాంలో వచ్చిన వినతులను తక్షణం పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్–1, 2 టి.ఎస్.ఎన్.రాజు, ఆర్.వి.రాజు, రెవెన్యూ ఆర్‌వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.సునీల్‌కుమార్, ఇంజినీరింగ్ ఈఈలు టి.ప్రసన్నరెడ్డి, మత్స్యరాజు, డీఈ భరణికుమార్, ఏపీడీలు పద్మావతి, ఈఈ వాటర్ సప్లై సూరిశెట్టి శేఖర్ పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు విలువైనవి



30వ వార్డులో వలంటీర్లను సత్కరిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్



29వ వార్డులో సేవా పురస్కారాలు అందుకున్న వలంటీర్లతో ఎమ్మెల్యే వాసుపల్లి

మహారాణిపేట: వలంటీర్ వ్యవస్థ ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవినీతి రహిత పాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ కొనియాడారు. 30వ వార్డు కార్పొరేటర్ కోడూరి అప్పలరత్నం ఆధ్వర్యంలో ఏపీడీ పుణ్యవతి సమక్షంలో సోమవారం సేవా పురస్కారాలు అందుకున్న వలంటీర్లను ముఖ్య అతిథిగా ఆయన ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు నేరుగా లబ్ధిదారుల ఇంటి ముంగిటకే అందిస్తున్న వలంటీర్ల విలువైన సేవలే మా రాజకీయ భవిష్యత్తని అన్నారు. వలంటీర్లను గౌరవిస్తూ సేవా వజ్రకు రూ.45 వేలు, సేవా రత్నకు రూ.30 వేలు, సేవా మిత్రకు రూ.15 వేలు అందించడం ఆనందదాయకమన్నారు. రాష్ట్రానికి వైఎస్ జగన్ నాయకత్వం కావాలని, మంచి పనులు చేసే నాయకుడు ప్రజలకు అవసరమని వాసుపల్లి పేర్కొన్నారు. చింతపల్లి హేమలతకు సేవా వజ్ర అవార్డు రావడంపై ఆయన అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ 30వ వార్డు అధ్యక్షులు పెంటపల్లి సత్యనారాయణ, నాయకులు చిన్ని, దిలీప్, రామలక్ష్మి, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

దేశానికే ఆదర్శం.. వలంటీర్ వ్యవస్థ

అల్లిపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అమలు చేస్తున్న వలంటీర్ వ్యవస్థ దేశానికి ఆదర్శనీయమని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ అన్నారు. 29వ వార్డులో సోమవారం వైఎస్సార్‌సీపీ నాయకుడు పీతల వాసు ఆధ్వర్యంలో ఏపీడీ పుణ్యవతి సమక్షంలో వలంటీర్లకు పురస్కారాలు అందజేశారు. చందకవీధి సచివాలయం చెందిన సే వారత్న, సేవా మిత్ర పొందిన వలంటీర్లను సత్కిరంచారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా నిలిచిన వలంటీర్లకు రుణపడి ఉంటామన్నారు. చరిత్రకమైన వ్యవస్థను రూపొందించిన ఘనత సీఎం వైఎస్ జగన్ మాత్రమే సాధ్యమన్నారు. కార్యక్రమంలో స్టేట్ డైరెక్టర్, మండల ప్రెసిడెంట్ పీతల వాసు, స్టేట్ డైరెక్టర్ నీలాపు లక్ష్మి, కోరాడ సురేష్, బెవర మహేష్, బుల్లెట్ రవి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్: బురుజుపేటలో కొలువైన కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగే ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబర్ 060810011006681 టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ చేస్తారు. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లలో సంప్రదించవచ్చు.

ఘనంగా ప్రమాణ స్వీకారోత్సవం



ట్రస్ట్ బోర్డు సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఈవో దేముడు, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

అల్లిపురం: సూర్యాబాగ్‌లోని విశ్వేశ్వరస్వామి దేవస్థానం ఆలయ ట్రస్ట్ బోర్డు ప్రమాణ స్వీకారం సోమవారం ఘనంగా జరిగింది. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ సమక్షంలో ఆలయ కార్యనిర్వహణాధికారి దేముడు ట్రస్ట్ బోర్డు సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విశ్వేశ్వరస్వామి ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసి తీర్చిదిద్దేందుకు నూతన కమిటీ కృషి చేయాలన్నారు. ట్రస్ట్ బోర్డు చైర్మన్‌గా బాదంపూడి సూర్యాకాంతం, సభ్యులుగా రెడ్డి జగన్ మోహన్‌రావు, మళ్ల రమాదేవి, విజయ, కోడూరు మల్లిక ప్రియాంక, వడ్డాది జయలక్ష్మి, ఎక్స్ అఫీషియో సభ్యుడిగా బాదంపూడి విశ్వేశ్వరరావు నియమితులయ్యారు. కార్యక్రమంలో 30వ వార్డు కార్పొరేటర్ కోడూరి అప్పలరత్నం, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు దొడ్డి బాపు ఆనంద్, కనకమహాలక్ష్మీ దేవస్థానం చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వసంత్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు పెంటపల్లి సత్యనారాయణ, కనకరెడ్డి, దశమంతుల మాణిక్యాలరావు, రీసు అనురాధ, రామలక్ష్మి, లింగం శ్రీను, లండా రమణ, ముజీబ్‌ఖాన్, బుజ్జి, ఆదివిష్ణు, చిన్ని, దిలీప్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా రవాణాతో పర్యావరణానికి మేలు



ఆర్టీసీ బస్సులో కార్యాలయానికి చేరుకుంటున్న మేయర్ హరివెంకటకుమారి



కార్యాలయానికి సైకిల్‌పై వస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

డాబాగార్డెన్స్: వారంలో ఒక్కరోజు ప్రజా రవాణా వినియోగించడం ద్వారా నగర కాలుష్యాన్ని అరికట్టవచ్చని మేయర్ గొలగాని హరివెంకటకుమారి అన్నారు. సోమవారం ఆమె తన క్యాంప్ ఆఫీస్ నుంచి జీవీఎంసీ కార్యాలయానికి ఏపీఎస్ ఆర్టీసీ బస్సులో చేరుకోగా.. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ తన బంగ్లా నుంచి సైకిల్‌పై కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలో కాలుష్య నియంత్రణకు వారంలో ఒక రోజు జీవీఎంసీ ఉద్యోగులతో పాటు అందరూ ప్రజా రవాణాను వినియోగిస్తున్నామని తెలిపారు. ఎకో–వైజాగ్ అభివృద్ధి నేపథ్యంలో ఎకో జీరో పొల్యూషన్ కార్యక్రమంలో భాగంగా నగరంలో పర్యావరణ పరిరక్షణకు, కాలుష్య నియంత్రణకు జీవీఎంసీ అనేక అవగాహన చర్యలు చేపడుతోందన్నారు. కాలుష్య నియంత్రణకు ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, కళాశాలల యాజమాన్యం, పరిశ్రమల యాజమాన్యాలు, స్వచ్ఛంద సంస్థలు, నగర ప్రజలు సహకరించి వారంలో ఒకరోజు ప్రజా రవాణా వ్యవస్థ వినియోగించాలని విజ్ఞప్తి చేశారు.

రక్షణ కల్పించాలని హాస్టల్ విద్యార్థుల వినతి



కలెక్టర్ కార్యాలయం వద్ద ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

మహారాణిపేట: ఊర్వశి జంక్షన్ సమీపంలోని కప్పరాడ ట్రైబల్ వెల్ఫేర్ బాయ్స్ హాస్టల్‌లో చదువుతున్న తమకు రక్షణ కల్పించాలని, సమస్యలు పరిష్కరించాలని విద్యార్థులు కోరుతున్నారు. ఆల్ ఇండియా డెమోక్రాటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్(ఏఐడీఎస్‌వో) విశాఖ నగర కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట వారు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్గనైజేషన్ నగర అధ్యక్షుడు అభిలాష్ మాట్లాడుతూ ఇటీవల కాలంలో కొన్ని రౌడీమూకలు చీకటి పడిన తరువాత హాస్టల్‌కు వచ్చే దారిలో కాపుకాచి ఒంటరిగా వస్తున్న విద్యార్థులపై దాడులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత డిసెంబర్ 9న ఒక జూనియర్ కాలేజీ విద్యార్థిపై దాడి చేసి మొబైల్ ఫోన్ లాక్కున్నారని, ఇటువంటి దాడులు, దోపిడీలు తరచూ జరుగుతూనే ఉన్నాయన్నారు. ఈ ఘటనలపై పోలీసులు వెంటనే చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు. అనంతరం కలెక్టరేట్‌లో జరిగిన స్పందన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందించినట్లు అభిలాష్ తెలిపారు.

ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

అల్లిపురం: బహిరంగ ప్రదేశంలో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను మహారాణిపేట పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. మహారాణిపేట రామజోగిపేట వద్ద ఖాళీ స్థలంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో నగర పోలీస్ కమిషనర్ ఎ.రవి శంకర్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ వెంకటరావు ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ప్రసాదరావు ఆధ్వర్యంలో సీఐ అప్పలనాయుడు దాడులు చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.1,15,120 నగదు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిని మహారాణిపేట పోలీస్ స్టేషన్‌కు అప్పగించడంతో అరెస్టు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రేమసమాజంలో లిఫ్ట్ ఏర్పాటు



లిఫ్ట్‌ను ప్రారంభిస్తున్న కంచర్ల రామబ్రహ్మం, బుద్ధా శివాజీ

డాబాగార్డెన్స్: డాబాగార్డెన్స్ ప్రేమసమాజం ప్రాంగణంలోని కంచర్ల అన్నపూర్ణాదేవి ఏసీ ఆడిటోరియానికి ప్రేమసమాజం మాజీ అధ్యక్షుడు కంచర్ల రామబ్రహ్మం ఆర్థిక సాయంతో ఏర్పాటు చేసిన లిఫ్ట్‌ను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రామబ్రహ్మం మాట్లాడుతూ ప్రేమసమాజం స్థాపించిన నాటి నుంచి నేటి వరకు తన తాత కంచర్ల రామబ్రహ్మం, తండ్రి కంచర్ల సుబ్రహ్మణ్యం దత్తుతోపాటు తాను కూడా సేవలందించే భాగ్యం కలిగినందుకు సంతోషం వ్యక్తం చేశారు. తన మాతృమూర్తి పేరిట నిర్మించిన ఈ ఆడిటోరియంలో వృద్ధుల సౌకర్యార్థం లిఫ్ట్ ఏర్పాటు చేయడం తమ కుటుంబానికి ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు. ప్రేమసమాజం అధ్యక్షుడు బుద్ధా శివాజీ మాట్లాడుతూ కంచర్ల రామబ్రహ్మం కుటుంబం 3 తరాలుగా సమాజానికి అందించిన ఎనలేని సేవలను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు మట్టపల్లి హనుమంతరావు, కేశప్రగడ నరసింహమూర్తి, కార్యదర్శి కె.హరిమోహన్ రావు, కోశాధికారి ఎం.వి.వి.కె.గుప్తా, సంయుక్త కార్యదర్శి వి.మోహన్‌రావు, సభ్యులు కంచర్ల కృష్ణకుమార్, జగదీశ్వరరావు, పైడా కృష్ణప్రసాద్, కృష్ణారావు, నాగేశ్వరరావు, సత్యనారాయణ, గణపతి రావు, కొండలరావు, ఆశ్రమ వాసులు పాల్గొన్నారు.

ఆరుగురికి ఎమ్మెల్యే వాసుపల్లి ఆర్థిక సాయం



బాధితులకు ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

అల్లిపురం: ఆపదలో ఉన్నవారికి తానున్నానంటూ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ భరోసా కల్పిస్తున్నారు. తన సొంత నిధుల నుంచి ఆర్థిక సాయం చేస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారు. 35వ వార్డు ప్రసాద్ గార్డెన్స్‌కు చెందిన బోర లక్ష్మణ్‌రావు, పండా వీధికి చెందిన అన్నపర్తి చంటి, గణేష్ పాఠశాల ప్రాంతానికి చెందిన కరకనా కనక మహాలక్ష్మి, స్ప్రింగ్ రోడ్డు ప్రాంతానికి చెందిన బడిటోయిన కన్నారావు, 33వ వార్డు బంగారుమెట్టకు చెందిన పుతిక కోటేశ్వరరావు, 37వ వార్డు పెయిందొర పేటకు చెందిన బుసరా అప్పారావులు వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నట్లు తెలుసుకున్న ఆయన సోమవారం ఒక్కొక్కరికీ రూ.5 వేల చొప్పున రూ.30 వేలు అందజేశారు. వారి ఆరోగ్యం మెరుగుపడి త్వరగా కోలుకోవాలని కోరుకున్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, స్టేట్ డైరెక్టర్లు, జిల్లా నాయకులు, ఆలయ చైర్మన్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరికలు



సూర్యారావు, లక్ష్మీకాంతంను వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

డాబాగార్డెన్స్: కాంగ్రెస్ పార్టీ 29వ వార్డు అధ్యక్షుడు, మత్స్యకార నాయకుడు మైలపల్లి సూర్యారావు, జలమడుగుల లక్ష్మీకాంతం వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీ మండల అధ్యక్షుడు పీతల వాసు నేతృత్వంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దక్షిణ నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరడం ఖాయమన్నారు. జగనన్న అందిస్తున్న సుపరిపాలనకు ప్రజలతోపాటు ఇతర పార్టీల నేతలు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ వైపు మొగ్గు చూపుతున్నారని తెలిపారు. మరో 30 ఏళ్లు ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉంటారని ధీమా వ్యక్తం చేశారు. 29వ వార్డులో ప్రజాదరణ ఉన్న మైలపల్లి సూర్యారావు, లక్ష్మీకాంతం రావడం వార్డులో మరింత బలం చేకూరినట్టయ్యిందన్నారు. నీలాపు లక్ష్మి, బెవర మహేష్, కోరాడ సురేష్, బుల్లెట్ రవి పాల్గొన్నారు.